విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 29, నవంబర్ 2024

భోగేశ్వరంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - గడివేముల: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ దుర్గాభోగేశ్వర స్వామిని కార్తీక మాసం సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి వివిఎల్ఎన్ రామానుజన్, వేద పండితులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె శ్రీ దుర్గ బొగేశ్వరునికి అభిషేక పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్యాం సుందర్ శర్మ, ఆలయాధికారి రామానుజన్ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డిని సత్కరించి ఆలయ జ్ఞాపికను అందజేశారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ దేశం సత్యనారాయణ రెడ్డిలకు పూలమాలలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిందుకూరు సర్పంచి అనసూయమ్మ, దుర్వేసి హైమవతి, పెసరవాయి టిడిపి నాయకురాలు వడ్డు లక్ష్మీదేవి, బొల్లవరం సుభద్రమ్మ, కరిమద్దెల ఈశ్వర్ రెడ్డి, గడిగరేవుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

16 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని పెట్నికోట గ్రామ సమీపంలోని కనుమ మిట్ట వద్ద ఆటోలో తరలిస్తున్న 14 క్వింటాల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమేష్ బాబు గురువారం తెలిపారు. సిఐ వివరాల మేరకు అవుకు మండలం కొండమనాయుని పల్లెకు చెందిన గోపాలకృష్ణ అక్రమంగారేషన్ బియ్యాన్ని 35 ప్యాకెట్లతో నింపుకొని బొలెరో ఆటోలో తరలిస్తుండగా దాడి చేశారు. గోపాలకృష్ణ సేకరించిన రేషన్ బియ్యాన్ని పెట్నికోట మీదుగా యాడికిలోని బాబు వద్దకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఆటో, 35ప్యాకెట్లలోని 1400కేజీ ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యతోనే మంచి భవిష్యత్తు : డీఈవో

విశాలాంధ్ర - మహానంది: విద్యతోనే మంచి భవిషత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి అన్నారు. గురువారం మహానంది మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక శ్రద్ధతో చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు పాఠశాల సమయాన్ని పాటించాలని కోరారు. గుడ్లు, చెక్కి లను పరిశీలించారు. ఎంఈఓ రామసుబయ్య, ఎంఆర్ పి.తిమ్మయ్య, తదితరులు ఉన్నారు.

టెంట్ హౌస్‌ను ప్రారంభించిన బీసీ ఇందిరారెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె: మండలం పరిధిలోని వండ్లాపురం గ్రామానికి చెందిన గడేకరి రామకృష్ణుడు ఆహ్వానం మేరకు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా నూతన టెంట్ హౌస్ సప్లయర్ సామాగ్రి షాప్‌ను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి ప్రారంభించారు. ఇందిరా రెడ్డి మాట్లాడుతూ షాప్ యజమాని అభినందించారు. వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలని కోరారు.

రెండు గడ్డివాములు దగ్ధం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: మండల పరిధిలోని పెద్ద కొప్పెర్ల గ్రామంలో గురువారం రాత్రి రెండు గడ్డివాములు దగ్గయయ్యాయి. గ్రామానికి చెందిన మహదేవుడు, మునగల సుదర్శన్ రెడ్డి లకు చెందిన రెండు గడ్డివాములు ప్రమాదవశాత్తు నిప్పు అంటూకొని పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. శంకర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డిలు వెంటనే అగ్నిమాప శాఖకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పాయి. లక్షలు వెచ్చించి వేసుకున్న గడ్డివాములు దగ్ధం కావడంతో పశువులకు మేత లేకపోయిందని బాధ్యతలు అంటున్నారు. సుమారు లక్షన్నర నష్టం జరిగిందని ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని బాధ్యతలు అన్నారు.

సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహన

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామ పరిధిలోగల జీటీఎంఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం సైబర్ నేరాలు, మత్తు పదార్థాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శిరివెళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ వంశీధర్,సబ్ ఇన్స్పెక్టర్ పీరయ్య యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ వంశీధర్ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో టెక్నాలజీని అందిపుచ్చుకొని కొందరు జీవితాలను ఉన్నతంగా తీర్చి దిద్దుకుంటూ ఉండగా, మరికొందరు ఇదే టెక్నాలజీతో ఈజీ మనీ సంపాదనే ధ్యేయంగా సైబర్ క్రైంకు పాల్పడుతూ విలువైన జీవితాలను కోర్టులు పోలీస్ స్టేషన్ల చుట్టూ లాయర్ల చుట్టూ తిరుగుతూ వృధా చేసుకుంటున్నారని సిఐ వంశీధర్ అన్నారు. ప్రస్తుతం ప్రతి ప్రభుత్వ పథకానికి బ్యాంక్ ఖాతాకు, పాన్ కార్డ్, ఆధార్ కార్డు తదితర వాటికి సెల్ నంబర్ లింక్ చేయాల్సి ఉందన్నారు. మొబైల్ నెంబర్ ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఏదో ఒక ఆశ చూపి అన్ లైన్ మోసాలకు పాల్పడుతున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సై పీరయ్య యాదవ్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, ర్యాగింగ్, మత్తు పదార్థాల పట్ల యువత, విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వార్డు పర్యవేక్షణకు మమ్మల్ని పిలవండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణంలో మునిసిపల్ కమిషనర్ ప్రతి రోజూ వార్డులో తిరుగుతూ ఉంటారని, తమకు సమాచారమే ఇవ్వడం లేదని కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు కమిషనర్ నిరంజన్ రెడ్డిని నిలదీశారు. నంద్యాల మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం గురువారం చైర్పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన జరిగింది. అజెండాలోని 23 అంశాలపై చర్చించి, అందులో రోడ్డు వెడల్పు ప్రతి పాదన అంశాన్ని సభ్యుల సూచన మేరకు వాయిదా వేశారు. మిగతా వాటికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే టేబుల్ అజెండా అంశాలపై చర్చించారు. గడప గడపకు మన ప్రభుత్వం క్రింద మొదలు పెట్టని పనులను రద్దు చేసి 25 శాతం పనులను నిలిపివేయాలని, పూర్తయిన పనులకు జనరల్ ఫండ్ కేటాయించి కాంట్రాక్టు వారికి డబ్బులు డ్రా చేయాలని చైర్ పర్సన్ మాబున్నిసా కోరారు. జనరల్ ఫండ్ నిధులు గడప గడపకు పనులకు బిల్లులు చెల్లించడం తగదని టిడిపి కౌన్సిలర్ మహబూబ్ వలి అభ్యంతరం తెలుపగా, పలువురు కౌన్సిలర్లు నిధులు విడుదల చేయాలని చెప్పడంతో చైర్మన్ ఆ అంశాన్ని ఆమోదించారు. గతంలో అమృత్ పథకం కింద కుళాయి కనెక్షన్లు ఫ్రీ అని చెప్పారని, ఇప్పుడు డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు కౌన్సిలర్లు సభ దృష్టికి తేగా, కమిషనర్ వివరణ ఇస్తూ విడతల వారీగా కొళాయి డబ్బులు కట్టాల్సిందేనని సూచించారు. పట్టణంలో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని శానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ తరహాలో శ్రీశైల క్షేత్రం అభివృద్ధి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: తిరుమల క్షేత్ర తరహాలోనే శ్రీశైల మహా క్షేత్రాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు సమగ్ర వివరాలతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, శ్రీశైలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్, ఆత్మకూరు డిఎఫ్ఓ సాయి బాబా, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, సర్వే ల్యాండ్ ఏడి జయరాజు తదితర అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన దేవాదాయ, పర్యాటక, ఆర్అండ్ బీ మంత్రుల కమిటీ సమావేశంలో నిర్దేశించిన మేరకు జిల్లాలో శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధికి సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు అవసరమయ్యే నివేదికలను శుక్రవారం సాయంత్రంలోగా అందజేయాలని దేవాదాయ, అటవీ, సర్వే అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాబోయే రెండు సంవత్సరాలలో శ్రీశైలం క్షేత్రాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో నివేదికలు తయారు చేసి ఇస్తే మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు.

బలవంతపు శిక్షణల వెనకున్న మతలబు ఏంటి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఉపాధ్యాయుల బలవంతపు శిక్షణల వెనుక మతలబు ఏంటని ఎస్టియు, జిల్లా ప్రధాన కార్యదర్శి అజం బేగ్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఎస్టియు ముఖ్య నాయకుల సమావేశంలో అజం బేగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఒకవైపు వేధిస్తుందని, పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయని, తల్లిదండ్రుల మెగా సమావేశం సమీపిస్తోంది, మార్కులు, అపార్, ఆన్లైన్లో నమోదు విషయంలో ఉపాధ్యాయులు తలమునకలై ఉన్నారన్నారు. 8 పిరియడ్లకు గాను ప్రతి ఉపాధ్యాయునికి ప్రతిరోజు కనీసం 7 పీరియడ్ల పని భారం ఉందన్నారు. ఉపాధ్యాయులకు పాఠశాల సెలవు దినాల్లో అనగా వేసవి సెలవుల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కొఠారి కమిషన్ లాంటి విద్యా కమిషన్లు స్పష్టంగా సూచించినప్పటికీ, ఈ అధికారులు ఎవరి మెప్పు కొరకు బలవంతంగా ఉపాధ్యా యులను పాఠశాల పని దినాల్లో లీడర్షిప్ శిక్షణాన్ని, పాఠశాల సముదాయాల శిక్షణ అంటూ ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేసి ప్రాణాలు పోయేటట్టు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఇలాంటి శిక్షణను ఆపి విద్యార్థుల ప్రయోజనం కాపాడకపోతే మరొక చలో విజయవాడ వంటి భారీ ఉద్యమానికి సిద్ధంకావాల్సి వస్తుందన్నారు. సీని యర్ నాయకులు సుబ్బయ్య, తిరుపతయ్య, మాజీ రాష్ట్ర సహాధ్యక్షుడు చంద్ర శేఖర్, పుల్లయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయండి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లాలో ప్రారంభించిన సిసి రోడ్ల నిర్మాణ పనుల పూర్తికి నాలుగు వారాలు మాత్రమే సమయం ఉందని నాణ్యత ప్రమాణాలు పాటించి మండలాల వారీగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పంచాయతీరాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసి రోడ్ల నిర్మాణ పనుల ప్రగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఈఈలు నాగరాజు, రఘురామిరెడ్డి, డిఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1026 సిసి రోడ్ల నిర్మాణానికి గాను 255 రోడ్లు పూర్తి అయ్యాయని మిగిలిన 771 సీసీ రోడ్ల లక్ష్యాన్ని నాలుగు వారాలుగా విభజించుకొని వారపు లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 240 రోడ్లకు గాను 41 పూర్తయ్యాయని నిర్మాణంలో ఉన్న199 రోడ్లను డిసెంబర్ చివరి నాటికి క్యూరింగ్‌తో సహా పూర్తి కావాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల నియోజకవర్గంలో 103 రోడ్లకు 27 పూర్తయ్యాయని, మిగిలిన 76 రోడ్లు, పాణ్యం నియోజకవర్గంలో 71 రోడ్లకు 15 పూర్తయ్యాయని మిగిలిన 56 రోడ్లు, శ్రీశైలం నియోజకవర్గంలో 165 రోడ్లకు 57 పూర్తయ్యాయని మిగిలిన 108 రోడ్లు, బనగానపల్లి నియోజకవర్గంలో 147 రోడ్లకు 33 పూర్తయ్యాయని, మిగిలిన 114 రోడ్లు, డోన్ నియోజకవర్గంలో 64 రోడ్లకు 27 పూర్తయ్యాయని, మిగిలిన 37 రోడ్లు, నందికొట్కూరు నియోజకవర్గంలో 236 రోడ్లకు 55 పూర్తయ్యాయని మిగిలిన 181 రోడ్ల నిర్మాణాలను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని ఏఈ, డీఈలను ఆదేశించారు. గతవారం 158 సిసి రోడ్ల నిర్మాణాల లక్ష్యానికి గాను 123 పూర్తి చేశామన్నారు. సిమెంట్, ఇసుక అందుబాటు లో ఉండి చేయడానికి ఇబ్బంది ఏంటని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. పూర్తయిన రోడ్లను 21 రోజులకు తక్కువ గాకుండా క్యూరింగ్ చేయాలన్నారు. నిర్దేశించిన రోడ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

అవినీతిపై ఏపీ సీఐడీ విచారణ జరిపించాలి : సీపీఐ

విశాలాంధ్ర - నందికొట్కూరు: పట్టణ మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపైన రాష్ట్ర ప్రభుత్వం సిఐడి విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి నుండి సంబంధిత సొమ్మును రికవరీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. గురువారం పట్టణ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే జయ సూర్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘురామమూర్తి మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బేబీ మాట్లాడుతూ మున్సిపాలిటీలో రూ1 కోటి 20 లక్షల రూపాయల అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని వెల్లడించడం జరిగిందన్నారు. కాగా ఇప్పటివరకు జరిగిన అవినీతిపై ఎలాంటి విచారణ చేపట్టలేదని, ఎమ్మెల్యే తక్షణమే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏపీ సిఐడిచే సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అవినీతి అక్రమాలను ప్రజల ముందు ఉంచాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు ప్రసాద్,ఏ ఐ టియుసి నాయకులు శంకర్,ఉస్మాన్ భాష,రాము తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఉయ్యాలవాడ మండలం గోవిందపల్లె గ్రామ సర్పంచ్ ఉమాదేవి భర్త చంద్రశేఖర్ రెడ్డితో పాటు మరికొందరు వైసీపీని వీడి టిడిపిలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం చంద్రశేఖర్ రెడ్డితో పాటు మరో 25 కుటుంబాలు వైసీపీని వీడి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, టిడిపి నాయకుడు భార్గవ్ రామ్ ఆధ్వర్యంలో టిడిపి పార్టీలో చేరారు. వీరికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసే అభివృద్ధి పనులను మరియు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆళ్లగడ్డ అభివృద్ధికు చేసే సేవలను చూసి వైసీపీని వీడి టిడిపిలోకి రావడం జరిగిందని గోవింద పల్లె గ్రామం నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పార్టీలో చేరిన వారికి భూమా కుటుంబం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే అఖిలప్రియ, జగత్ విఖ్యాత్ రెడ్డి, భార్గవరామ్ తెలిపారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక లాభాలు

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: డ్రాగన్ ఫ్రూట్‌తో అధిక లాభాలు పొందవచ్చని డ్వామా పిడి జనార్ధన్ రావు తెలిపారు. గురువారం మండలంలోని పెద్దెమనూరు గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ సాగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ ద్వారా పళ్ళతోట సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నమ్మన్నారు. రైతుల ప్రోత్సాహానికి సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. గ్రామపంచాయతీలో రోజుకు 50 మంది కూలీలకు తగ్గకుండా పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి : బీసీ ఇందిరమ్మ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని బీసీ ఇందిరమ్మ అన్నారు. గురువారం కోవెలకుంట్ల పరిధిలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 9వ రాష్ట్రస్థాయి యంగ్ మూడో పోటీలలో 11వ జాతీయస్థాయి యంగ్ మూడో పోటీలు కరస్పాండెంట్ జాన్ మేరీఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ఆటలతో పాటలతో ఆకట్టుకున్నాయి. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు మంచి గుర్తింపు వస్తాయనిఆమె అన్నారు. కరస్పాండెంట్ జాన్ మేరీ, ప్రిన్సిపల్ గీతా మేరీ, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ 1 వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులలో బీసీలకు ప్రత్యేక స్థానం కల్పించాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం బీసీ నాయకులు కృషి చేయాలని ప్రముఖ వైద్యులు బిసి నాయకుడు డా.నాగన్న, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్ అన్నారు. మహాత్మ జ్యోతి రావు పూలే134వ వర్ధంతి ని పట్టణంలోని సంగమేశ్వర సర్కిల్ నందు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డబ్బి వెంకటస్వామి గౌడ్, గౌరవ అధ్యక్షులు బి. రామకృష్ణ, ఉపాధ్యక్షుడు వీరన్న ప్రధాన కార్యదర్శి మాజీ ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ మన్నెం బాలస్వామి యాదవ్‌లు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సత్యశోధక సమాజం స్థాపించి బాలికా విద్య కోసం, సమ సమాజ స్థాపన కోసం, అంటరానితనం నిర్మూలన కోసం కృషి చేశారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వము బీసీల సంరక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం సంతోషదాయకమని, నామినేటెడ్ పదవులలో బీసీలకు ప్రత్యేక స్థానం కల్పించాలని, బీసీలకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించుటకు కేంద్ర ప్రభుత్వముతో ఒప్పించాలన్నారు. ఫారెస్ట్ ఆఫీసర్ వెంకటరమణ గౌడ్, వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు గోగుల తిమ్మయ్య, నారాయణ యాదవ్, ఎం పెద్ద నాగన్న, పెద్దన్న, బొల్లు నగేష్ యాదవ్ పాల్గొన్నారు.

పట్టణంలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తాం

విశాలాంధ్ర - నందికొట్కూరు : పట్టణంలో త్రాగునీటి, డ్రైనేజీ సమస్యలను, ప్రధాన రహదారి అయిన కేజీ రోడ్డును డివైడర్, ఫ్లడ్ లైట్ల వెలుగులో నందనవనంగా మారుస్తామని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక జై కిసాన్ పార్కు నందు మున్సిపల్ కమిషనర్ ఎస్.బేబీ ఆధ్వర్యంలో వైస్- చైర్మన్ మొల్ల మహబూబ్ రబ్బాని అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరయ్యారు. సమావేశంలో ముందుగా ఏజెండా లోని అంశాలను కౌన్సిల్ సభ్యులకు డీఈ చదివి వినిపించారు. ఈ సందర్భంగా 1వ వార్డు కౌన్సిలర్ చిన్న రాజు మాట్లాడుతూ డిసెంబర్ 2వ తేదీ నుండి జనవరి 3వ తేదీ వరకు సిఎస్ఐ పాలెం మరియు ఎబియం పాలెం కాలనీలలో డ్రైనేజీ కాలువలు తీయించి, ఫాగింగ్ చేయించాలని, ప్రతిరోజు చెత్తా చెదారం తరలించాలని కమిషనర్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ 2వ వార్డులో దీర్ఘకాలిక సమస్యల తయారైన పశు వధశాల సమస్యను పరిష్కరించాలని, 2వ వార్డులో మున్సిపాలిటీకి చెందిన 5 సెంట్ల స్థలం నిరుపయోకరంగా ఉందని ఆ స్థలంలో బోరు వేయించి బండలతో కాంపౌండ్ వాల్ మరియు గేటు నిర్మిస్తే అక్కడ పశు వధశాలను నిర్వాహకులు ఏర్పాటు చేసుకుంటారని కమీషనర్ ను కమిషనర్ ను కోరారు. కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తన వార్డులో సీసీ రోడ్డు నూతన నిర్మించారని ఆ సీసీ రోడ్డులో ద్విచక్ర వాహనాలు వేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, సిసి రోడ్డుపై స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్స్ అడిగినటువంటి సమస్యలను పరిష్కరిస్తారని కమిషనర్ బేబీ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ టీడీపీ హయంలో జరిగిన అభివృద్ధి తప్ప గత వైసిపి ప్రభుత్వంలో పట్టణం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. పట్టణానికి వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నందికొట్కూరు ను నందన వనంగా మారుస్తానని తెలిపారు.అన్ని వార్డులలో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటి కప్పుడు డ్రైనేజీ కాలువలు తీయించి బ్లీచింగ్, ఫాగింగ్ చేయించాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ వైస్-చైర్మన్ మొల్ల మహబూబ్ రబ్బాని, ఆర్బపోగు ప్రశాంతి. కౌన్సిలర్లు కాటేపోగు చిన్నరాజు, మొల్ల జాకీర్ హుస్సేన్, బోయ జయమ్మ, షేక్ రేష్మ, దేశెట్టి సుమలత, కరిష్మా, కొండారెడ్డి విజయమ్మ, శాంత కుమారి పాల్గొన్నారు.

బలవంతపు తొలగింపును ఆపాలి : సీపీఐ

విశాలాంధ్ర - మహానంది : అధికార పార్టీ నాయకులు మహానంది గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ బలవంతపు తొలగింపును ఆపాలని సీపీఐ నాయకులు సామెలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వంలో నియమించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించడం మంచి పద్ధతి కాదని అన్నారు. అతను కిడ్నీ సమస్యతో బాధపడుతుంటే ఆదుకోవాల్సినది పోయి బలవంతంగా ఉద్యోగాలకు రాజీనామా చేయమని అధికార పార్టీ నాయకుడు చెప్పడం బాధాకరమన్నారు. అధికార పార్టీ నాయకుడికి ఊడిగం చేస్తున్న ఉద్యోగులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించడం సరైన పద్ధతి కాదని, ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగిస్తే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలను కలుపుకొని కలెక్టర్, సీఎం దృష్టికి తీసుకుపోయి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు గురుమూర్తి డిమాండ్ చేశారు.

భగీరథ ప్రయత్నం

విశాలాంధ్ర - చాగలమర్రి: మండలంలో చివరి దశలో ఉన్న వివిధ పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేశారు. గురువారం చాగలమర్రిలోని దస్తగిరిస్వామి రహదారిలోగల రైతులు రామసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, రమణ, లక్ష్మయ్య, శ్రీను, రాము, బాష మరి కొందరు రైతులు వాడుముఖం పట్టిన కంది, జొన్న, పెసర పంటలను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. తుఫాన్ ప్రభావం కూడా లేకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు చివరి ప్రయత్నం చేస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంటలను కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. సమీపంలోని వంక నీటి వద్ద ట్రాక్టర్ ఇంజన్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి పంట పొలాల వరకు 70 లెన్తుల పైపులు వేసి వంటలను తడుపుకుంటున్నారు. ఎలాగైనా పంటలను కాపాడుకోవాలని అన్నదాత చివరి ప్రయత్నం సాగిస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్ జమ్ములదిన్నె గ్రామ మెట్ట వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గుర్తించి, సీజ్ చేసినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఉదయం ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. జమ్మలమడుగు పట్టణానికి చెందిన నవీన్ అనే వ్యక్తి డాక్టర్ సహాయంతో అక్రమంగా జమ్ముల దిన్నెకు ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రిన్సిపాల్

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని వైపిపీఎం జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన అజయ్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆళ్లగడ్డ వైపిపీఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా కొత్తగా వచ్చిన అజయ్ కుమాంకు అభినందనలు తెలియజేశారు. కళాశాల విద్యార్థిని విద్యార్థులకు చక్కటి విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు.

సాంఘీక విప్లవ జ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే

విశాలాంధ్ర - పాములపాడు : భారత సాంఘిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జాతీయ బీసీ సంఘం నాయకులు బత్తుల సంజీవరాయుడు, రాయలసీమ మాల మహానాడు నాయకులు అబ్రహం, వివేకానంద విద్యా విహార్ కరస్పాండెంట్ గోపాల్ తెలిపారు. జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన పనులపాడులోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల బీసీ నాయకులు శివశంకర్, శ్రీనివాసులు, మురళి, ఎంకన్న, వాసు, కృష్ణమోహన్, సురేష్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సిడిపిఓ తేజస్వరి అన్నారు. ఐసిడిఎస్ కార్యాలయం వద్ద బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అంగన్వాడి కార్యకర్తలతో గురువారం ప్రతిజ్ఞ చేయించడం జరిగినది. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం నేరం అన్నారు. బాల్య వివాహాలు బాలికల విద్య రక్షణ ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాలను నిరోధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంగన్వాడి సూపర్వైజర్ పార్వతి, దస్తగిరమ్మతో పాటు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో ఆధార్ క్యాంప్ : ఈవోపీఆర్డీ

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ పంచాయతీ గ్రామంలో శుక్రవారం 29వ తేదీన ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఈఓపిఆర్డి శ్రీనివాసుల వర్మ తెలిపారు. యర్రగుంట్ల గ్రామంలోని సచివాలయం-2లో ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ తప్పులను సరిచేసుకొని, నూతనంగా ఆధార్ నమోదుసదుపాయం ఉందన్నారు. పట్టణాలకు వెళ్లి సమయాన్ని వృధా చేసుకోకుండా అందుబాటులో ఉన్న ఆధార్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, శుక్రవారం 29, నవంబర్ 2024

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు పూలే : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా బిర్లా గేట్ కూడలి వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల అభ్యున్నతికి,సామాజిక అంతరాలను తొలగించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించి, 1848 ఆగస్టులో బాలికలకు పాఠశాల స్థాపించి స్త్రీ విద్యను ప్రోత్సహించారన్నారు. 1873 సెప్టెంబరు 24న పూలే తన అనుచరులతో కలిసి అణగారిన వర్గాల ప్రజలకు సమాన హక్కులు పొందటానికి సత్య శోధక్ సమాజాన్ని పూలే స్థాపించారన్నారు. సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడైన జ్యోతిరావ్ పూలే మానవ హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. అట్టడుగు, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన వ్యక్తి పూలే అన్నారు. జ్యోతిరావు పూలే ను స్ఫూర్తిగా తీసుకుని, వారి ఆశయాలను అనుసరించి ఉన్నత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, బిసి సంఘం అధ్యక్షుడు నక్కల మిట్ట శ్రీనివాసులు, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ఎలాంటి లోటు లేకుండా నిర్వహించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: సాగు నీటి సంఘాల ఎన్నికల్లో ఎలాంటి లోటు, పాట్లు లేకుండా పటిష్ఠంగా సజావుగా విధంగా చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ స్పెషల్ సిఎస్ జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. గురువారం విజయవాడ కార్యాలయం నుండి సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ అంశం పై జిల్లా కలెక్టర్ లతో జలవనరుల శాఖ స్పెషల్ సిఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా స్పెషల్ సిఎస్ సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ లకు దిశా నిర్దేశం చేశారు. సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై డివిజన్ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించాలని, సజావుగా ఎన్నికలను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని స్పెషల్ సిఎస్ జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష మాట్లాడుతూ సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి డిసెంబర్ 5వ తేదిన నోటిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 8వ తేదిన ప్రాదేశిక నియోజకవర్గం వాటర్ యూజర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు ఉంటాయని, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 11వ తేదీన ఎన్నికలు, ప్రాజెక్ట్ కమిటీలకు 14వ తేదీన ఎన్నికలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అధికారుల నియామకం పూర్తి చేశామన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్‌ఓ సి.వెంకట నారాయణమ్మ, జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, డిఈలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - కర్నూలు: పేదలు నిర్మించుకునే ఇండ్లకు రాష్ట్ర ప్రభుత్వం 5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగర సమితి ఆధ్వర్యంలో గీతా ముఖర్జీ నగర్ ఏరియాలోని 38 ,40 వార్డు సచివాలయాలలో పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి గీతా ముఖర్జీ నగర్ శాఖ సహాయ కార్యదర్శి కామ్రేడ్ రామచంద్ర అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ నాగరాజులే పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన సెంటు స్థలం ఏ మాత్రం ఇంటి నిర్మాణానికి సరిపోదని, ఆ స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి పేదలు ఎవరు ముందుకు రాలేదన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోవని, ఏ ఒక్కరు ఇల్లు నిర్మాణం చేయలేదన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు, రెండు సెంట్లు స్థలం ఇస్తామని పేదలకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తవుతున్నదని రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు పెంచి ఇవ్వాలని ఇసుక సిమెంటు స్టీలు ప్రభుత్వం ఫ్రీగా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర నాయకులు సోఫియా, ఆశా బేగం, నాగేశమ్మ, బాలకృష్ణ, రాముడు, బాలస్వామి, బాష, మహిళలు పెద్ద సంఖ్యలో ధర్నా లో పాల్గొన్నారు.

టీడీపీలోకి పార్లపల్లి వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, అయన సోదరుడు గ్రామ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డిలతో పాటు వారి అనుచరులు దాదాపు 500 మందికిపైగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, సంక్షేమ కార్యక్రమాలను చూసి పార్టీలోకి చేరుతున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేతులు ఎత్తేసిందన్నారు. దీంతో ప్రజలు వైసిపికి 11 సీట్లకే పరిమితం చేశారని విమర్శించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

విశాలాంధ్ర - హెూళగుంద: హెూలగుందాలో విద్యుదాఘాతంతో రైతు ఈడిగ విరుపన్న (49) మృతిచెందినట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీ నారాయణ నాయక్ గురువారం తెలిపారు. మృతుడు వరి పంటల కోసం నారుమడిలో గేజ్ వీల్ కొడుతుండగ విద్యుత్ వైర్లు ట్రాక్టర్కు అడ్డంగా రావడంతో విద్యుత్ వైర్లు ఎత్తివేస్తుండగా ఆకస్మాత్తుగావిద్యుత్ సరఫరా కావడంతో రైతు ఇరుపన్న మరణించాడని అన్నారు. మృతుడి భార్య ఈడిగా లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. శవాన్ని పోస్ట్మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని పేర్కొన్నారు.

నూతన బస్సులు ప్రారంభం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: గత ప్రభుత్వం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోకు బస్సు కాదు, ఒక టైరు తీసుకొచ్చిన పాపాన పోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రయాణికులకు ఇబ్బందికరంగా లేకుండా 6 నెలలలో మూడుసార్లు 12 కొత్త ఆర్టీసీ బస్సులను తీసుకొచ్చామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో ఎమ్మిగనూరు - నెల్లూరు, తిరుపతి, కర్నూలు- గూడూరు కొత్త బస్సులను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా కూటమి ప్రభుత్వం త్వరలోనే ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్, టిఐ ఎలప్ప, ఆర్టీసీ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మూరంగా టీడీపీ సభ్యత్వాలు

విశాలాంధ్ర -ఆలూరు : మండల కేంద్రమైన ఆలూరుతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో టీడీపీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆలూరు టిడిపి వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ముమ్మురంగా సభ్యత్వ నమోదు చేపట్టడం జరిగిందని, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బళ్లారి రోడ్‌లోని టిడిపి సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే సాధ్యం అన్నారు. సభ్యత్వం నమోదుపై అవగాహన కల్పిస్తూ సభ్యత్వాలు ముమ్మరంగా చేయించడం జరుగుతుందన్నారు.

స్పాట్ అడ్మిషన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024 - 25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్లకు పీజీ సెట్‌లో అర్హత సాధించని, పీజీ సెట్-2024 పరీక్షకు హాజరు కాని అర్హత గల అభ్యర్థులతో స్పాట్ అడ్మిషన్స్ కింద సీట్లను భర్తీ చేసుకునేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులను జారీ చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. లోకనాథ గురువారం తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల కింద అడ్మిషన్ పొందిన వారు ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయానికి అర్హులు కారని ఆయన తెలిపారు.

మిర్చి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మిర్చి రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ విమర్శించారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక బస్టాండ్ ఆవరణంలో మిర్చి రైతులను ఆదుకోవాలంటూ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కనీసం రైతులకు కాస్తో కూస్తో గిట్టుబాటు ధర ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పూర్తిగా నిట్టనిలువ ముంచే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వంతో పోరాడైనా రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పిస్తానని అబద్ధపు హామీలు ఇచ్చిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తానని చెప్పి కనీసం మద్దతు ధర కూడా ఇవ్వని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి డీడీలు చెల్లించిన రైతులకు ట్రాన్స్ ఫార్మర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగిలి మారెప్ప, మదరసాబు, రజ్జప్ప, బుడ్డన్న, మహబూబ్, ముక్కన్న, బాష, తదిత రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇంటి స్థలం ఇవ్వాలి

విశాలాంధ్ర - కల్లూరు: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్లు పట్టణ ప్రాం తాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి డంబోళం శ్రీనివాసులు అన్నారు. ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని, పేదల ఇల్లు నిర్మించుకోవడానికి సిమెంటు స్టీలు గృహ నిర్మాణానికి ఉచితంగా ఇవ్వాలని, పేదలు నివసిస్తున్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కల్లూరు ఏరియా వార్డులలో ముజఫర్ నగర్ ఏరియా 81, 82, 6, 63, 92, 93, 97, 107, 108, 34, 11 సచివాలయాల్లోని అడ్మిన్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యుడు అన్వర్, రాజీవ్ గృహకల్ప శాఖ కార్యదర్శి రామాంజనేయులు, ముజఫర్ నగర్ శాఖ సెక్రెటరీ రాబియా, అసిస్టెంట్ సెక్రటరీ మల్లికార్జున, వీకర్ సెక్షన్ కాలనీ సెక్రటరీ అబ్రహం, ఏఐటీయూసీ నగర నాయకురాలు రేణుక, రామచంద్ర నగర్ శాఖ నుంచి జానకి, ప్రజానాట్యమండలి నాయకుడు దప్పు మాణిక్యం, రమణ, మారుతి, చక్రవర్తి, ఎం.గిడ్డమ్మ, లక్ష్మన్న, పద్మావతి, సైనాజ్ లక్ష్మీదేవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలో ప్రతిభా కనబరిచిన విద్యార్థులు

విశాలాంధ్ర - హెూళగుంద: హెూళగుంద జిల్లా పరిషత్ హై స్కూల్లో చిత్రలేఖన, వ్యాస రచన, రంగులు వేసే పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు హెడ్మాస్టర్ ఎండి నజీర్ అహ్మద్ శనివారం విద్యా ర్థులకు సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ వేసి అభినందించారు. హెడ్మాస్టర్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ నిర్వహించిన స్వచ్ఛభారత్ ఆర్ట్ కాంపిటీషన్లో విద్యార్థులు మూడు రకాల పోటీల్లో మొదటి స్థానం పొందారని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సంగుల విద్యార్థులు మొదటి స్థానం దక్కినందుకు ఎంతో గర్వంగా ఉన్నదని అన్నారు. ఇదే రీతి విద్యార్థులు చదువులో రాణించాలని విజ్ఞప్తి చేశారు. కలరింగ్ పోటీల్లో కే రిజ్వాన్, ఎం పల్లవి, బీటీ ఉమ్మిజి, కె హర్షిత వ్యాసరచన పోటీల్లో తస్లీమా, సులేమా, సీద ఫాతిమా, చిత్రలేఖన పోటీల్లో ఉజుమా కౌసర్, జోయా మహిన్ విద్యార్థులు మొదటి స్థానంలో విజయం సాధించారు. ఉపాధ్యాయులు సమీనా, ఉమా, సంజీవ్, ఆదినారాయణమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: యూపీ రాష్ట్రం సంబల్ పట్టణంలో మసీదు సర్వే సందర్భంగా పోలీస్ కాల్పుల్లో 5 మంది ముస్లిం యువకులు చనిపోవడానికి నిరసనగా గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు నూర్ అహ్మద్, ఎంహెచ్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి గౌస్ ఖాన్, ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షులు జునైద్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా విభాగం మాజీ అధ్యక్షుడు నూరు మొహమ్మద్, మానవ హక్కుల సంఘం నాయకులు జిక్రియ, సద్దాం హుస్సేన్, ఖాదర్బాషా పలువురుతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడుతూ పోలీసుల కాల్పుల్లో మరణించిన మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ముస్లిమ్స్‌పై విచక్షణ రహితంగా కాల్పులకు పాల్పడిన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళల మొదటి గురువు జ్యోతిరావు పూలే

విశాలాంధ్ర - హెూళగుంద: ఎల్లార్తి గ్రామంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే వీరుపాక్షి ఆయన చిత్ర పటానికి పూలమాలా వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే వీరుపాక్షి మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన వర్గాలు కోసం, మహిళల చదువు కోసం ఎంతో శ్రమించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజా, వెంకటేష్, మహాదేవ, శివ, సాయి, ముత్తుంజయ, శ్రీకాంత్ ఫల్గొన్నారు.

అందరి సహకారంతోనే బాల్యవివాహాల నిర్మూలన

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : అందరి సహకారంతోనే బాల్యవివాహాల నిర్మూలన సాధ్యమని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ జనరల్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. బాల్య వివాహ రహిత భారత్ కార్యక్రమాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వెంకటరమణ కాలనీ పున్నమి అతిథి గృహం నుంచి కెవిఆర్ కళాశాల వరకు విద్యార్థులు ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కెవిఆర్ కళాశాల అధ్యాపకులు నాగిరెడ్డిలు మాట్లాడుతూ బాల్యవివాహాలు జరిపించడం, ప్రోత్సహించడం కూడా శిక్షార్హమేన న్నారు. బాల్యవివాహాల వల్ల అతి చిన్న వయసులోనే గర్భం దాల్చడం వల్ల అనారోగ్యం పాలు కావడమే కాకుండా జన్మనిచ్చిన బిడ్డ కూడా అనారోగ్యం పాలు అయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. పరిసరాల్లో జరిగే బాల్య వివాహాలు నిరోధించడానికి వెంటనే 1098 కు సమాచారాన్ని అందించాలన్నారు. లక్ష్మీ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు లయన్ రాయ పాటి నాగలక్ష్మి, లయన్స్ క్లబ్ సభ్యులు, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - ఆదోని : ఆదోని రోటరీ క్లబ్ తుంగభద్ర జోన్-5 ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత గుండె, డయాబెటిస్ వ్యాధి శిబిరానికి విశేష స్పందన వచ్చిందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ సైఫుల్లా తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు, సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షల్లో ఆదోని పట్టణంలోని సీనియర్ ఫిజీషియన్లు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ బాలాజీ, డాక్టర్ అవినాష్, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ గోవిందరాజులు, డాక్టర్ శాలి జమీల్, డాక్టర్ కౌశిక్ గుప్తా సోమిశెట్టి, డాక్టర్ సైఫుల్లా పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన వైద్య శిబిరంలో 157 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. హిమోగ్లోబిన్, క్రియాటిన్, కొలెస్ట్రాల్, యూరిక్ యాసిడ్, కంటి పరీక్షలు, దంత వైద్య పరీక్షలు, థైరాయిడ్, షుగర్, ఈసీజీ వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేసుకున్న కార్మికులు రోటరీ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపడుతామని వారు తెలిపారు. అంతకుముందు ఆదోని ఆర్టీసీ ఇన్చార్జి డిపో మేనేజర్ అమర్నాథ్, అసిస్టెంట్ ఇంజనీర్ వేణుగోపాల్, కార్మిక సంఘం నాయకులు హరిబాబు శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ప్రశాంత్ గాంధీ, సునీల్ రెడ్డి, జీవన్ సింగ్, భరత్ షా, రాజేష్ జైన్, ఇతేష్, వికాస్ జైన్, హుస్సేన్ బాష పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు ఉపాధ్యాయులకు శాపంగా మారాయి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: లిటరసి, న్యూమరసి పేరుతో ప్రభుత్వం నిర్వహించే రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు ఉపాధ్యాయులకు శాపంగా మారాయని ఎస్టియు జిల్లా కార్యదర్శి గోపాల్ విమర్శించారు. గురువారం ఎస్టీయు భవన్‌లో కౌతాళం మండల నాయకుడు ఆంజనయ్య అధ్యక్షతన ఆదోని-కౌతాళం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన ఎస్టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న ప్రసంగించారు. ఏపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు పాఠశాల నాయకత్వం అభివృద్ధి కార్యక్రమం, (ఎఫ్ఎల్ఎన్) ఫౌండేషన్ లిటరసీ మరియు న్యూమరసి పేరుతో రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు నిర్వహించటం ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉందన్నారు. ఈ మధ్య కాలంలో కృష్ణాజిల్లా అరిగేపల్లిలో జరిగిన శిక్షణ తరగతులలో ఒక ఉపాధ్యాయుడు మరణించడం జరిగిందని, గుర్తు చేస్తూ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నేడు విజయనగరం జిల్లా గజపతినగరంలో శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమైన సంఘటనని, ఇరువురి ఉపాధ్యాయుల మృతి పట్ల ఆదోని-కౌతలం మండలాల ఎస్టీయు సమితి తరపున ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజనేయులు, రాము, సుధాకర్, మౌలాలి సాహెబ్, రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్, పట్టణ అధ్యక్షుడు కె.రవి ఎస్టీయూ నాయకులు గంగ నాయక్, శ్రీరాములు, జయరాం పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-గూడూరు: పేద ప్రజల కుటుంబాలకు ఎంతో భరోసానిస్తున్న టిడిపి సభ్యత్వం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు జే సురేష్ అన్నారు. సీనియర్ టిడిపి నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఆర్.ఖానాపురంలో స్తానిక టిడిపి నేతలతో కలిసి సురేష్ పర్యటించి సభ్యులతో సభ్యత్వ నమోదు చేయించారు. టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు పేద ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని అన్నారు. టిడిపి సభ్యత్వం పొందిన కుటుంబాలకు ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునిస్వామి, టిడిపి నేతలు సుమన్ బాబు, మన్నెంకొండ, నరసింహ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగ జరుగుతున్న గ్రామాభివృద్ధి

విశాలాంధ్ర - హెూళగుంద: మండల కేంద్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుంది. స్థానిక ఊరు వాకిలి వద్ద గ్రామపంచాయతీ నిధుల ద్వారా సిసి రోడ్లు, డ్రైనేజ్ పనులను సర్పంచ్ చెలువాది రంగమ్మ, గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ, టిడిపి నాయకులు యు.కాడ సిద్ధప్ప, మురళి దర్, సురేష్ , గ్రామ పెద్దలు పంపాపతి, బాబన్నశనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్లు, మంచినీటి పైపులై నిర్మాణం, డ్రైనేజీ పనులు చేపడుతున్నామని అన్నారు, గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో పంచాయతీ నిధులు, ఎంపీపీ, పల్లె పండుగ నిధులతో వీధులన్నీ సీసీ రోడ్లు, నీతో పాటు ఇతర పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆస్తులను ఎంతో బాధ్యతయుతంగా కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. డిజిటల్ పంచాయతీ కోసం పగలు రాత్రి కష్టపడి ఆన్లైన్ చేస్తున్నా మని పేర్కొన్నారు.

బాల్య వివాహ రహిత భారత్‌కు సహకరించాలి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: బాల్య వివాహ రహిత భారత్ కొరకు ప్రతి ఒక్కరు సహకరించాలని అసోసియేషన్ కోఆర్డినేటర్ లక్ష్మీ నారాయణ కోరారు. గురువారం స్థానిక నవ యూత్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్ వివాహ ముక్త్ భారత్ లో భాగంగా నవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు గ్రామాల్లో అవగాహన ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. డైరెక్టర్ నరసింహులు మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా ప్రతి గ్రామంలో గోడ పత్రికల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

మార్కెట్లో ఉల్లిగడ్డల గరిష్ట ధర రూ.5439

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ కర్నూలు: వ్యవసాయ మార్కెట్కు గురువారం వివిధ పంటల ఉత్పత్తులు వచ్చాయి 77 మంది రైతులు 1423 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు తెచ్చారు. క్వింటా రూ.1130, మధ్యధర రూ.4118, గరిష్టదర రూ.5439 పలికింది. వేరుశెనగ గరిష్ట ధర రూ.6359, ఆముదాలు రూ.5643, బొక్క జొన్నలు రూ.2251, కందులు రూ.9371, శనగలు రూ.6196, ఎండు మిరపకాయలు రూ.5439, కొర్రలు రూ.2789, మినుములు రూ.8200 ధరల చొప్పున వ్యాపారస్తులు కొనుగోలు చేశారు.

డిగ్రీ కళాశాలకై స్థల పరిశీలన

విశాలాంధ్ర - కోడుమూరు : నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణలో భాగంగా కర్నూలు ఆర్డీవో కె.సందీప్ కుమార్ ప్రభుత్వ పోరంబోకు స్థలాలను పరిశీలించారు. గురువారం కోడుమూరు చేరుకున్న ఆయన మండల తహశీల్దార్ వెంకటేష్ నాయక్‌తో కలిసి డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థలం కోసం అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ఇందులో భాగంగా కోడుమూరు గ్రామ పరిధిలోని కొండ పైన సర్వేనెంబర్ 181/18లో వున్న 5ఎకరాల విస్తీర్ణం గల ప్రభుత్వ పోరంబోకు భూమిని పరిశీలించి, ఆ ప్రాంతంలోని జగనన్న లేఅవుట్ ప్లాట్ల స్థలం గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా గ్రామ పరిధిలో ఏవైనా డిగ్రీ కళాశాల నిర్మాణం కోసం అనువైన ప్రభుత్వ స్థలాలు ఉంటే గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సునీల్, వీఆర్వోలు నారాయణ, ఎల్లప్ప, గ్రామ సర్వేయర్ మాదన్న తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపకుడు మహాత్మ జ్యోతిరావు పూలే

విశాలాంధ్ర - సి.బెళగల్: జాతి వివక్ష లేని సమసమాజ స్థాపన కోసం జీవితం మొత్తాన్ని అంకితం చేసిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సిబి గోవిందరెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న జ్యోతిరావు పూలే సావిత్రమ్మ భాయ్ విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షులు సి బి గోవింద రెడ్డి తో పాటు సి బెళగల్ గ్రామ సర్పంచ్ పాండురంగన్న, ఉపసర్పంచ్ ఎస్ఎం ఇబ్రహీం, కో ఆప్షన్ మెంబర్ హారుణ్, వైసిపి మండల కార్యదర్శి టిజి వెంకటేష్, బాయ్ కాటిమద్దిలేటి, బాయ్ కాటి మద్దిలేటి పాల్గొన్నారు.

సామాజిక దార్శనికుడు జ్యోతిరావు పూలే

విశాలాంధ్ర-పత్తికొండ: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రంగస్వామిలు పేర్కొన్నారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో కుల,లింగ వివక్ష లేకుండా అన్ని వర్గాలకు విద్య అందాలని కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సురేష్ కుమార్, మైరాముడు, సత్య నారాయణ, మల్లికార్జున,సురేంద్ర కుమార్, కృష్ణయ్య, నరసింహయ్య, మహేష్, రాజశేఖర్ నాయుడు, రవి కుమార్, వాసు, బాలభాష, నారాయణ స్వామి, ప్రసాద్ బాబు, దామోదర్ ఆచారి, మధుబాబు, నాగరాజు, నెట్టేకల్లు, పాల్గొన్నారు.

మాలల సమ్మేళన సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: పట్టణంలోని జెపి గార్డెన్లో జరుగు మాలల ఆత్మీయ సమ్మేళన సభను జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర నాయకులు కుమారస్వామి, రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు జై భీమ్ సాయిరాం,జిల్లా అధ్యక్షుడు మహానంది పిలుపునిచ్చారు. గురువారం అంబేద్కర్ నగర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా క్రిమినల్ విధానాన్ని రద్దు పరిచేంతవరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు జరిగే ఆత్మీయ సమ్మేళన సభకు మాజీ ఎంపీ హర్ష కుమార్, జాతీయ నాయకులు మంగరాజు, మాసేన రాజేష్, అశోక్ కుమార్,దామోదర రాధాకృష్ణ,అంబటి కొండలరావు వస్తున్నట్లు విజ్ఞప్తి చేశారు.

అలుపెరగని కృషి చేసిన మహనీయుడు పూలే

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: సమాజంలో పరివర్తన కోసం అలుపెరగని కృషి చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిబాపూలే అని రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సులర్ ఆచార్య ఎన్‌టికె నాయక్ కొనియాడారు. గురువారం వర్సిటీలోని విసి కాన్ఫరెన్సుహాలులో జరిగిన కార్య క్రమంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలవేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. కుల మత ప్రాంతీయ విభేదాలతోపాటు లింగవివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరూ ఎదగడానికి సమానావకాశాలుండాలని ఆశించిన మహనీయుడు పూలే అన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 29, నవంబర్ 2024

జ్యోతిరావు పూలే స్ఫూర్తితో చంద్రబాబు పాలన : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : మహాత్మా జ్యోతీరావు పూలే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని, ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వెనుకబడిన తరగతుల వారికి రూ.39 వేల కోట్లపైగా నిధులు కేటాయించడమే ఇందుకు ఉదాహరణ అని, చంద్రబాబు రాకతో బీసీలకు మంచిరోజులు వచ్చాయని రాష్ట్ర న్యాయ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా నంద్యాల స్థానిక పద్మావతి నగర్ దగ్గర ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ సంఘ సంస్కర్తల్లో మహాత్మా జ్యోతిరావు పూలే ముందు వరుసలో ఉంటారన్నారు. అణగారిన వర్గాలు, స్త్రీల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహానుభావుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యా బోధనకు వర్చువల్ తరగతి గదులు ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రాష్ట్రంలోనే ప్రప్రథమంగా వర్చువల్ క్లాస్ రూం ద్వారా జిల్లాలోని పదవ తరగతి విద్యార్థులకు బోధనా తరగతులు ప్రారంభం కానున్నాయి.గురువారం జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్చువల్ క్లాస్ రూం ట్రయల్ రన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం పాఠశాల, ఇందిరా గాంధీ మెమోరియల్ పాఠశాలల విద్యార్థులతో కలెక్టర్ సంభాషించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్చువల్ విధానం ద్వారా పాఠశాలలలోని 10 వ తరగతి విద్యార్థులకు మెరుగైన విద్య అందించబోతున్నామన్నారు. అధునాతన సాంకేతిక పరికరాలతో జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఒక స్టూడియోను ఏర్పాటు చేశామని తెలిపారు..జిల్లాలోని 352 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బోధన అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు..ఇప్పటికే 119 పాఠశాలలకు బోధన అందించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు. త్వరలో అన్ని పాఠశాలలకు కనెక్ట్ అయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన 42 మంది అనుభవజ్ఞులైన టీచర్లు వర్చువల్ విధానం ద్వారా బోధన అందించేందుకు ముందుకు వచ్చారని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు టీచర్లతో ఇంటరాక్ట్ అయ్యే సౌకర్యం ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. స్టూడియో ద్వారా పాఠశాలలకు ప్రత్యక్ష ప్రసారం చేసేటప్పుడు ఎలాంటి ఆటంకాలు లేకుండా పిల్లలకు స్పష్టంగా కనిపించేలా ఇంటర్నెట్ కనెక్షన్ వేగాన్ని పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ మీటింగ్‌ను పండుగలా జరపాలి - జిల్లా కలెక్టర్ : జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ డిసెంబర్ 7 వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఒక పండుగలా జరపాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ప్రగతి తెలుసుకోడానికి ఈ కార్యక్రమం ద్వారా వీలు కలుగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ 7వ తారీఖున జరగబోయే మెగా పేరెంట్స్ డేకు సంబంధించిన పాటలను రికార్డ్ చేస్తున్న రికార్డు రూమును కలెక్టర్ సందర్శించి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. శ్యామ్యూల్ పాల్, ఇతర విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే..

విశాలాంధ్ర - బనగానపల్లె : భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు యాదగిరి అధ్యక్షతన అసెంబ్లీ కన్వీనర్ బి వి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ కన్వీనర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అనగారిన వర్గాల కోసం ఎంతగానో కృషి చేశాడన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం వారిలో చైతన్యం రావడం కోసం ఎంతగానో కృషి చేశారు అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడుశివరామిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శరత్ చంద్రకుమార్, మండల ప్రధాన కార్యదర్శి శివరామిరెడ్డి, మండల కార్యదర్శి తిరుమలయ్య, మునీరు, అంజి బాష, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని మల్లెవేముల బస్టాండు సమీపంలోని బిసి సంఘం కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి సంఘం అధ్యక్షుడు లక్ష్మి నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని అట్టడుగు వర్గాల కోసం నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు రామతీర్థం, పీరయ్య, చిన్నికృష్ణ, రమణ, సుబ్బరాయుడు, ప్రతాప్‌రెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

విశాలాంధ్ర -బేతంచెర్ల : అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతూ వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఆశా దీపమైన వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అంటూ మండల ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి స్మరించుకున్నారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా వైసీపీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి నివాలర్పించిన ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలికల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని,సమాజం లో అసమానతలపై నిరంతరం తమదైన శైలిలో పోరాడుతూనే, నిమ్న, అణగారిన వ్యక్తుల జీవితాల బాగు కోసం శ్రమించిన అనితర సాధ్యుడు పూలే అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మూర్తు జావలి, చంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, ఖాజా, పిఏ తిమ్మయ్య, కౌన్సిలర్లు ఇబ్రహీం, కోట్ల మధు, జస్వంత్ రెడ్డి, ఖాజా,సలీం,నిరంజన్, పిక్కిలి మనోహర్ నాయుడు, ఎద్దులన్న, సచివాలయం కన్వీనర్ వలి బాష, పిట్టల జాకీర్, పెద్ద కేశవ నాయుడు, కొట్టం నాయుడు, సీతారామపురం మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణంలో బనగానపల్లె నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాలు యాదవ్ ఆధ్వర్యంలో జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతి లక్షంగా బీసీల అభివృద్ధి కోసం ఆయన కృషి చేశారు, బాల్య వివాహాల నిర్మూలనకు బాలిక విద్య అభివృద్ధి కోసం ఆయన కృషి చేశారు, వితంతు వివాహాలు అరికట్టేందుకు ఆయన ఎంతో పాటు పడ్డారు. ఈ కార్యక్రమంలో పాపన్న యాదవ్, రామచంద్రుడు, ఓబులేసు, సత్యం, బాలన్న, కుమార్, మల్లికార్జున, శీను తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ కర్నూలు : అణగారిన వర్గాల ఆశాజ్యోతి మన జ్యోతిరావు పూలేని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు పరిగెల మురళీకృష్ణలు ఆయన సేవలను కొనియాడారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం పి.మురళీకృష్ణ మాట్లాడుతూ సామాజిక కార్యకర్తగా, మేధావిగా, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్తగా, రచయితగా, కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణచి వేతకుగురెట్కున బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడు మన జ్యోతిరావు పూలేని అతను భారతదేశంలో కుల వివక్షకు వ్యతిరేకంగా కోట్లాది ప్రజానీకం కోసం, పేద, అణగారిన, అంటరాని ప్రజల హక్కుల కోసం పోరాడాడని మహిళోద్ధరణకు కృషి చేసాడని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీ మహానందీశ్వర స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మహానంది : కార్తీక మాస సందర్భంగా శ్రీ మహానందిశ్వర స్వామి కామేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకున్న శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శైలజ దంపతులు దర్శించుకు న్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణ అధికారి నల్లకాలువ శ్రీనివాస రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ మహా నందిశ్వర స్వామికి అభిషేకము కామేశ్వరి దేవి అమ్మవారికి అర్చనలు నిర్వహించి, కార్తీకదీపం ఆలయంలో వెలిగించారు. వీరిని ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీ స్వామి అమ్మవారి చిత్ర పటంతో శేష వస్త్రంతో సత్కరించారు. వేద పండి తులు వేద ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాద ములను అందజేశారు. ఉయ్యాలవాడ గ్రామా నికి చెందిన భరత్ కుమార్ రెడ్డి అనిత దంపతులు రూ.2.25 లక్షల విలువ గల బంగారు పూత కలిగిన వెండి కిరీటాన్ని శ్రీ కామేశ్వరి అమ్మవారికి ఎమ్మెల్యే ఆలయ కార్య నిర్వహణ అధికారి అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజక వర్గం సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, బుడ్డా శ్రీనివాస్ రెడ్డి నరాల మౌళిశ్వర రెడ్డి మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు, భూపతి రామ చంద్రుడు కైలాష్ పాటలశ్రీను ఉల్లి మధు మహానంది మండల నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దస్తగిరి స్వామి దర్గా పునఃప్రతీష్ట

విశాలాంధ్ర- గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని దశాబ్దాల నాటి మహబూబ్ సుభాని (దస్తగిరి స్వామి) దర్గా పూర్తిగా శిథిలావస్థలో ఉండడంతో గ్రామస్తులు, భక్తులు, దాతల సహకారంతో విరాళాలు సేకరించి మహబూబ్ సుభాని దర్గాను గురువారం పునఃప్రతిష్టించారు. దస్తగిరి స్వామి దర్గా పునః ప్రతిష్ట కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పాల్గొని స్వామి వారికి ఫాతేహాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక ఫాతహాలు నిర్వహించారు. వచ్చిన భక్తుల కొరకు మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి,

ఆర్థిక అభివృద్ధికి నిరంతర సేవలను కొనసాగిస్తాం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పేదింటి మహిళలు శిల్పా కుటుంబం చేపడు తున్న సేవా కార్యక్ర మాలపై నమ్మకాన్ని ఉంచారని, వారి నమ్మ కాన్ని వమ్ము చేయ కుండా గత 14 ఏళ్లు గా నిరంతరాయంగా శిల్పా సేవాసమితి ఆధ్వర్యంలో శిల్పా మహిళా సహకార్ బ్యాంక్‌ను నిర్వహిస్తున్నామని, తమకు ఎన్ని కష్టనష్టాలు వచ్చినా పేదింటి మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషిచేస్తామని శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ చైర్పర్సన్ నాగిని రవిసింగారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శిల్పా సేవాసమితి కార్యాలయం ఆవరణంలో 200 మంది మహిళలకు 21 లక్షల61వేల విలువగల చెక్కులను బ్యాంక్ చైర్పర్సన్ చేతులమీదుగా అందజేయడం జరిగింది. శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీల, శిల్పాసేవాసమితి మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బుగ్గ వంక వంతెన నిర్మాణానికి అంచనాలు

విశాలాంధ్ర - చాగల మర్రి : మండల కేంద్రం నుండి జ్ఞానా పురం వెళ్లే రహదారిలో బుగ్గ వంక పైన ఉన్న వంతెన దెబ్బ తినడం తో ఆ వంతెనను మండల పంచాయితీ రాజ్ ఏఈ గురువారం పరిశీలించారు. వంతెన ఎప్పుడు కూలిపోతుందని ఆ రహదారిలో రాకపోకలు సాగించేవారు ఆందో ళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, నంద్యాల పార్లమెంట్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించి ప్రజలకు ఇబ్బంది లేకుండా నూతన వంతెన నిర్మాణానికి అంచనా వేయాలని పంచాయతీరాజ్ చాగలమర్రి మండల అధికారి కొండారెడ్డిని వారు ఆదేశించారు. దీంతో దెబ్బతిన్న కాజ్ వేను పరిశీలించి, అంచనాలు వేయడం జరిగింది. ఈ దెబ్బతిన్న వంతెన దారిలో జ్ఞానాపురం, నారాయణ పల్లి, పెద్ద వంగలి, చిన్న వంగలి గ్రామాల ప్రజలే కాకుండా అనేకమంది రైతులు నిత్యం తిరుగుతూ ఉంటారు.

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తాం

విశాలాంధ్ర - చాగలమర్రి : అందరి సహ కారంతో మండలాన్ని అభివృద్ధి పరుస్తామని ఎంపీపీ వీరభద్రుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలవ ాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వివిధ శాఖల అధి కారులు తమతమ శాఖల పురోగతిని వివరిం చారు. తహశీల్దార్ రవి కుమార్‌కు డి.వనిపెంట సర్పంచ్ బాలిశ్వర్ రెడ్డి, పెద్ద భోదనం ఎంపిటిసి సభ్యులు నరసింహులు పూర్వం పొలాలకు వెళ్లే రస్తాలను పొలాలకు వెళ్లకుండా అడ్డగిస్తున్నారని, రస్తాల విషయం మాట్లాడితే మా మీదనే కేసులు పెడతామని తహసీల్దార్ బెదిరిస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై తహసీల్దారు మాట్లాడుతూ అను భవం ఉన్న రస్తాలు, పూర్వం నుండి వెళ్లే పొలాల రస్తాలను అడ్డగించకుండా యధాత ధంగా రస్తా వెంబడి వెళ్లాలని, జిల్లా ఉన్నతా ధికారులు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని సూచించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్య, నీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. మండలంలో సచివా లయాల వ్యవస్థ దారితప్పిందని, సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని, ఈ వ్యవ స్థను దారిలో పెట్టాలని అధికారులను అదేశిం చారు. జడ్పిటీసీ లక్ష్మిదేవి, వైస్ ఎంపిపిలు రఫీ, అశీర్వా దమ్మ, సీడీపీఓ తేజేశ్వరి, ఉద్యాన అధికారి శ్రీధర్, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, షాజహాన్, నరసింహారావు, వైద్యాధికారి అంజలి, పశు వైద్యాధికారి సాయిబాబా, ఏపీఓ నిర్మల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, పంచాయితీ కారదర్శులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: ఆత్మకూరు పురపాలక సంఘ అభివృద్ధికి శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో రూ.1 కోటి 39 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులతో ఇన్నర్ రింగ్ రోడ్డు అభివృద్ధి పనులు త్వరలో చేపడుతున్నామని ఆత్మకూరు పురపాలక సంఘం చైర్మన్ డాక్టర్ మారుఫ్, ఆసియా మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్‌లు తెలిపారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతనంలో జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో 10 అంశాలు కౌన్సిలర్ల ముందు అజెండా ప్రవేశపెట్టిగ అందులో 10 అంశాలను కౌన్సిల్ తీర్మానం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎం ఎ రషీద్ లు మాట్లాడుతూ కేజీ రోడ్డు నుంచి తిక్కయ్య స్వామి దర్గా మసీదు వరకు, రూ.1. కోటి,20 లక్షలతో ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆ పనులకు కావాల్సిన నిధులను మొదటి విడతలో కౌన్సిల్ తీర్మానంలో ఆమోదం తెలపడం జరిగింద న్నారు. ముఖ్యంగా పట్టణ ప్రజలకు డ్రైనేజీ కాలువలు అంతర్గత సి.సి రోడ్లు పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పట్టణ ప్రజలకు అన్ని విధాలుగా కృషి చేస్తామని సూచించారు చేతి పంపులు బోర్లు కొత్తగా వేసుకునేందుకు రూ.19 లక్షలు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులకు నిచ్చెన మరమ్మత్తుల పనులు చేపట్టేందుకు రూ" 2, లక్షలు చేపట్టే పనులకు ఆమోదించారు. పట్టణంలోని కొండ గార్డెన్ సమీపంలో మున్సిపాలిటీ స్థలంలో మహిళలకు పురుషులకు వాకింగ్ వెళ్లే వారికి జిమ్ పరికరాలను రూ.6 లక్షల 50 వేలతో కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, మేనేజర్ ఆర్ఐ నాగబ్రహ్మం, టిపిఓ రామకృష్ణ, ఏఈ షాహిద్ బాష, ఇన్వర్మెంటు ఏఈ ఓబులేష్, వర్క్ ఇన్స్పెక్టర్ రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజగోపాల్, వార్డు కౌన్సిలర్లు సుగుణమ్మ, పాణ్యం పార్వతి, లక్ష్మమ్మ, కైరున్ బీ, గౌస్, లాజం యూనిస్, మారుబోతుల విజయ్, రంగస్వామి మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలకోసం పని చేయాలి

విశాలాంధ్ర - పాణ్యం: మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్ర పటానికి విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు గురువారం పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించి, సభ నిర్వహించడం జరిగింది. ఈ సభకు ఎస్ఎస్‌యుఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన ప్రతాప్ అధ్యక్షులు వహించారు. ఈ సందర్భంగా సమాజ్ వాది పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ యాదవ్, సిపిఐ (ఎమ్మెల్యే) న్యూ డెమోక్రసీ పార్టీ, ఉమ్మడి జిల్లాల సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్ లు మాట్లాడుతూ మహాత్మా పూలె మనువాదంకు వ్య తిరేకంగా పోరాడి స్త్రీల హక్కులకు కోసం,బాలికలవిద్య కోసం మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడి స్త్రీల హక్కుల కోసం పోరాడిన గొప్ప మహనీయుడు అన్నారు. డిగ్రీ, ఇంటర్, అధ్యాపకులు, విద్యార్థి నాయకులు రాజు, వేణు, శ్రీరామ్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మహాత్మ జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి పురస్కరించు కొని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో చిత్రపటానికి నీలకంతప్ప, ఎండి బసవరాజ్ స్వామి, మల్లేశ్వరరావు, సాయినాథ్ పలువురు పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని దర్శించే వారు మాట్లాడుతూ రాష్ట్రల్లో బీసీ కులగలను జరిపించి రిజర్వేషన్ కల్పించలని కోరిన మహాగనుడనే కొనియాడారు. దేశ చరిత్రలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలను ఆదర్శంగా విద్య,సామాజికంగా, ఆర్థికంగా చేతనిచ్చి అభివృద్ధి కొరకు పాటుపడిన వ్యక్తి జ్యోతిరావు పూలే అంటూ పేర్కొన్నారు. బీసీ కులాలు 75శాతం ఉన్న రాజకీయ పార్టీలు ఓట్ల కోసము వాడుకోవడం జరుగుతుందని విమర్శించారు. బీసులకు చిన్న చిన్న పదవులు ఇచ్చి చేతులు దులుపుకోవడం అగ్రకుల రాజకీయ నాయకులకే సాధ్యమైందని విమర్శించారు. బీసీలకు అసెంబ్లీ,లోక్సభ స్థానాల్లో రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పడం ప్రకటనలకే పరిమితమైందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం బీసీలకు సీట్లు కేటాయించాలని కోరారు. గోవిందరావు, ఆంజనేయులు, మురళి దర్ గౌడ్, విరుపాక్షి, మంజునాథ్, కుమార్ స్వామి, రాముడు, గురుదేవ్, రత్నయ్య, జమీర్, దాదాబాష పాల్గొన్నారు.

విశాలాంధ్ర - వెలుగోడు: రాష్ట్రంలోని బీసీలందరి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, టిడిపి సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 134 వర్ధంతి సందర్భంగా వెలుగోడు పట్టణంలోని వేంపేట సర్కిల్లో గల జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే బాలికల విద్య కోసం, సమ సమాజ స్థాపన కోసము, అంటరానితనం నిర్మూలన కోసము కృషి చేశారని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు, టిడిపి నాయకులు అంకన్న, నాగన్న, భాస్కర్ గౌడ్, రాందాసు, రాజ లింగయ్య యాదవ్, గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అండర్- 19 ఫెన్సింగ్ క్రీడలు



విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణంలోని పద్మావతి నగర్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో గత రెండు రోజులుగా జరుగుతున్న అండర్ 19 బాల బాలికల రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడలు విజయవంతంగా ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి ,డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ రాజు, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గౌరవాధ్యక్షులు నిమ్మకాయల సుధాకర్, అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి హర్షవర్ధన్, ఉర్దూ డిఐ హసముద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎంపికైన ఆంధ్ర ప్రదేశ్ అండర్- 19 ఫెన్సింగ్ క్రీడాకారులు పాట్నాలో ఈ నెల 17 నుండి 21 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి క్రీడల విజయవంతం కావడంలో నంద్యాల జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని కొనియాడారు. ఫెన్సింగ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్టేట్ అబ్జర్వర్ భవాని తదితరులు పాల్గొన్నారు.